క్లుప్తంగా

సూర్యప్రభ వాహనంపై చెన్నకేశవుడి వైభవం


సూర్యప్రభ వాహనంపై స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల ఫారెస్టులో వెలిసిన కొలుట్ల శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు సూర్య ప్రభావాహనంపై విహరించారు. స్వామివారి ఉత్సమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్ నగరం తండాలో కార్డెన్ సర్చ్


కార్డెన్ సర్చ్‌లో పాల్గొన్న ఎక్సైజ్, సివిల్ పోలీసు అధికారులు

వెల్దుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్ నగరం తండాలో ఆదివారం కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల, వెల్దుర్తి సీఐ మధుసూదన్ రావ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. నాటుసారా తయారీ మానుకోవాలంటూ హెచ్చరించారు. గ్రామ సమీప పొలాల్లో దాచి ఉంచిన నాటు సారా సామగ్రిని, బిందెల్లో నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ఎస్ఐ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు.

రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

మద్దికెర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ పథకాలు అర్హులకు వర్తింపజేయడంలో భాగంగా భూమి గల ప్రతి రైతుకు భూధార్, ఫార్మర్ నమోదును ప్రారంభించినందని, సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఏఓ రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ భూధార్ ఉన్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్, సబ్సిడీ రుణాలు, ఇతర వ్యవసాయ పథకాలు వర్తిస్తాయన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నంబర్ జిరాక్స్ ప్రతులతో ఆర్ఎస్‌కేల్లో సంప్రదించాలని సూచించారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులోని మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పూజారులు మూలవిరాట్‌లకు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళ హారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆస్సరి మఠంలో అన్నదానం చేశారు.

23న మాలల యుద్ధ గర్జన

వెల్దుర్తి: ఈనెల 23వ తేదీన కర్నూలులో నిర్వహించనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు మాల కులస్తులు తరలిరావాలని మాల మహానాడు మండల సమితి అధ్యక్షుడు లింగం శ్రీనివాసులు, ప్రతినిధులు బాలాపురం రంగస్వామి, నామం మధు పిలుపునిచ్చారు. ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్మశానంలో చెట్ల తొలగింపు

హాలహర్వి: స్థానిక శ్మశానంలో పేరుకుపోయిన ముళ్ల కంప చెట్లను, దిబ్బలను సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఆదివారం జేసీబీతో తొలగించారు. ఆయన మాట్లాడుతూ శ్మశానంలో పేరుకుపోయిన చెట్లు, దిబ్బలపై గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో తొలగించామన్నారు.

ఉరుకుందలో రుద్ర హోమం


హోమం నిర్వహిస్తున్న పండితులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో ఆదివారం రుద్ర హోమాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. అరుద్ర నక్షత్రంలో రుద్ర హోమం నిర్వహించడం వల్ల శుభాలు కలుగుతాయని అందుకే ఈ హోమ కార్యక్రమాన్ని ఉరుకుందలో మూడు నెలల నుంచి చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నవగ్రహ మండపారాధన, రుద్ర కలశ ఆవాహన, రుద్రహోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామిని దర్శించుకొనేందుకు భక్తులు ఆదివారం పోటెత్తారు.


దేవనకొండలో అసంపూర్తిగా సచివాలయ భవన నిర్మాణం



పల్లెదొడ్డిలో రూ.40 లక్షలతో నిర్మాణం పూర్తయిన సచివాలయం

గ్రహణం వీడేనా?

- జగనన్న పాలనలో గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన పనులు
- పూర్తయిన వాటిని ప్రారంభించని వైనం

దేవనకొండ: పాలనను ప్రజల వద్దకు చేర్చాలని, మరింత మెరుగైన పాలనను అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ,వార్డు సచివాలయాల ఏర్పాటుకు నాటి సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించింది. వివిధ కారణాల వల్ల పనులు ఆలస్యంగా ప్రారంభమైన వాటి పనులను ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిలిపేసింది. అలాగే నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఉద్యోగులు విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే.. భవనాలను నెలల తరబడి ఖాళీగా ఉంచడంతో అసాంఘిక కార్యకలాపాలకు స్థావరాలుగా మారుతున్నాయి. ప్రజాధనం నిరుపయోగమైందని ప్రజలను విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్నవాటిని త్వరగా పూర్తి చేయాలని, నిర్మాణాలు పూర్తయిన వాటిని వినియోగంలోకి తీసుకు రావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

- నేటి నుంచి ఒకేషనల్ కోర్సులకు
- 15 నుంచి జనరల్ కోర్సులకు

పత్తికొండ రూరల్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం నుంచి ఒకేషనల్, 15వ తేదీ నుంచి సైన్స్ కోర్సుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) నిర్వహించనున్నారు. ఒకేషనల్ విద్యార్థులు 150 మంది, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు 200 మంది ప్రయోగ పరీక్షల్లో పాల్గొననున్నారని పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నయిమున్నీషా తెలిపారు. తుగ్గలి కేజీబీవీ, పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ఒక బ్యాచ్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు, రెండో బ్యాచ్‌కు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రయోగ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.


కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు


గజవాహనంపై దేవమ్మవ్వ విగ్రహం


హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆలూరు: స్థానిక కోటవీధిలో నూతనంగా నిర్మించిన దేవమ్మవ్వ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున దేవమ్మవ్వ నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో శివరుద్రయ్య స్వామి, మహేష్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం గంగపూజ, అఖండ దీపం,గణపతి నవగ్రహ పూజ, జలాధివాసం, శ్రీ-సూక్త హోమం, అమ్మవారికిఅభిషేకం, శయ్యాదివాసం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కాల్వ ఇలా.. ప్రవాహమెలా?


దేవనకొండ గ్రామ సమీపంలో ముళ్లపొదలతో నిండిన హంద్రీనీవా కాలువ

- పూడిపోయిన హంద్రి నీవా పంట కాలువలు
- చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిన వైనం
- ఆనవాళ్లు కోల్పోయినా పట్టించుకోని యంత్రాంగం
- గందరగోళంగా నీటి ప్రవాహం

దేవనకొండ: మండలంలోని హంద్రీనీవా పంట కాలువల్లో పిచ్చిమొక్కలు, గడ్డి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో కాలువలో సక్రమంగా నీరు ముందుకు కదలకపోవడంతో తమ పంట పొలాలకు సక్రమంగా నీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కాలువలో మొలిచిన పిచ్చి మొక్కలు తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


కరివేముల వద్ద శిథిలమైన కాల్వలో ప్రవహిస్తున్న హంద్రీనీవా నీరు




నేలతలమరి సమీపంలో హంద్రీనీవా కాలువలో పేరుకుపోయిన గడ్డి, పిచ్చి మొక్కలు

గడ్డివామి దగ్ధం


హెబ్బటంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామంలోని తోకన్‌పేట వీధిలో ఆదివారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో తాకూరు లక్ష్మన్నకు చెందిన గడ్డివాము కాలిపోయి రూ. లక్ష వరకు ఆస్తి నష్టం జరిగింది. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారో లేదా ప్రమాదవశాత్తు జరిగిందో తెలియదని గ్రామస్తులు తెలిపారు. ఉన్నట్టుండి మంటలు వ్యాపించడంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజిన్ సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా గ్రామంలో వరుసుగా గడ్డివాములు కాలి పోతుండటంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 3న 9 గడ్డివాములు కాలి బూడిదై రూ.10 లక్షలు, 8న రెండు గడ్డివాములు కాలి రూ.60 వేలు, గతేడాది ఇదే సమయంలో ఫిబ్రవరి 8న అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగి 9 గడ్డివాములు కాలి దాదాపు రూ.25 లక్షలు నష్టం సంభవించింది. ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా మంట పెడుతున్నారా.. లేదా పాతకక్షలా, అనుకోకుండా జరుగుతున్న సంఘటనలా అనేది అర్థం కావడం లేదని వారు పేర్కొంటున్నారు.

12న బసవేశ్వరస్వామి రథోత్సవం

హాలహర్వి: ఈనెల 12వ తేదీన మండలంలోని బాపురం గ్రామంలో బసవేశ్వరస్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. 12న సాయంత్రం 5 గంటలకు రథోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం ఆలయంలో బసవేశ్వరస్వామికి విశేష పూజలు ఉంటాయని చెప్పారు.

మద్యం విక్రేత అరెస్ట్

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామ శివారులో ఆదివారం వాటర్ ట్యాంక్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గ్రామానికి చెందిన బోయ ఓబులమ్మపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఈమె వద్ద నుంచి 180 ఎంఎల్ పరిమాణం గల 20 మ్యాన్షన్‌హౌస్, 25 బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం

మద్దికెర : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఆపద్బంధు సేవా సమితి అధ్యక్షుడు సునీల్ కుమార్, ధనుంజయ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో మండలస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 18 జట్లు పాల్గొంటాయన్నారు. ఈనెల 14 వతేదీ వరకు పోటీలు నిర్వహిస్తామని, ప్రతిభ కనబరిచిన జట్లకు వరుసగా.. రూ.10 వేలు, రూ.5 వేల నగదు అందజేస్తామని చెప్పారు.

'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

తుగ్గలి : ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కేంద్రం ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు ఆరోపించారు. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13వ తేదీన పత్తికొండలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం తుగ్గలిలో కరపత్రాలు పంపిణీ చేశారు. సదస్సుకు కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

క్రీడా సామగ్రి పంపిణీ

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించిన క్రీడా పరికరాలు, టవల్స్‌ను వార్డెన్ రమేష్ ఆదివారం పంపిణీ చేశారు. క్రీడా పరికరాలు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ట్యూటర్లు నాగేష్, సుధాకర్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

తుగ్గలి : సొంత భూమి ఉన్న రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 14 అంకెల ఐడీ నంబర్ కేటాయిస్తారన్నారు. ఈ ఐడీ నంబర్ పొందిన రైతులకు మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఎరువుల రాయితీలు, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు తదితర రాయితీలు వర్తిస్తాయని పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్సు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని కోరారు.

నాటి కోటపేట..
నేడు నిత్యాన్న క్షేత్రంగా..


కొండల్లో కాశిరెడ్డినాయన ఆశ్రమం, కోటపేట ఆంజనేయస్వామి గుడి

- కాశిరెడ్డినాయన ఆశ్రమంగా అలరారుతున్న కోటపేట
- భక్తుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న కాశిరెడ్డి నాయన
- నేడు ఆరాధనోత్సవాలు


కాశిరెడ్డినాయన ఆశ్రమ స్థాపకుడు రామచంద్రారెడ్డి

వెల్దుర్తి: అటవీ ప్రాంతం..పచ్చటి కొండ కోనలు... పక్షుల కిలకిలలు, పారే సెలయేళ్లు, నెమళ్ల అరుపులు...ఫల వృక్షాలు...అలనాటి పాలెగాళ్ల కోటలో మహిమాన్విత పాలుట్ల రంగస్వామి ఆలయ సమీపంలో ఆధ్యాత్మిక వెల్లివిరుస్తోంది. మండలంలోని శ్రీరంగాపురం గ్రామ పరిధిలోని బేతంచెర్ల రిజర్వ్ ఫారెస్ట్ చిన్నమల్కాపురం బీట్ ప్రాంతంలో శ్రీరంగాపురం గ్రామస్తుడు రామచంద్రారెడ్డి 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కాశిరెడ్డినాయన ఆశ్రమం నేడు ఎంతో మంది కడుపు నింపుతోంది. అలాగే భక్తుల కోర్కెలు తీర్చుతూ ఖ్యాతి పొందుతోంది.

నాటి కోటపేట..

ప్రస్తుత కాశిరెడ్డి నాయన ఆశ్రమ ప్రాంతంలో 150 ఏళ్ల కిందట కోటపేట గ్రామం ఉండేది. కొండ ప్రాంతంలో దొరలుగా పిలువబడే దాదాపు 50 కుటుంబాలు జీవనం సాగించాయి. ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామం ఎదుట ప్రతిష్ఠించి ఆరాధిస్తూ, సమీప పాలుట్ల రంగస్వామిని కొలిచేవారు. రాతికట్టడాల ఇళ్లలో నివసిస్తూ, గుర్రాలపై ప్రయాణిస్తూ విద్యగాళ్లగా పేరుగాంచారు. రాజుల శకం ముగిశాక పన్ను వసూళ్లకు బ్రిటీషు పాలకులు ముఖ్యంగా రామళ్ల కోట రిజిస్ట్రార్ పరిధిలో కోటపేట దొరలను ఉపయోగించారన్నది చరిత్ర. కరువు పరిస్థితుల్లో తమ భూములు, ఈ ప్రాంతాన్ని వదిలిన దొరలు పత్తికొండ ప్రాంతంలోని పందికోన, బేతంచెర్ల పరిధిలోని ముద్దవరం, మరిన్ని ప్రాంతాలకు వలసవెళ్లి స్థిరపడ్డారు. నేటికి వారు నివసించిన శిథిలావస్థలోని గృహాల ఆనవాళ్లు, కొలిమి, రోకళ్లు ఉన్నాయి. వారికి తాగునీటి సౌకర్యం కల్పించిన మంచినీటి బావి కోటపేట బావిగా ప్రాచుర్యంలో ఉంది.

నేడు కాశిరెడ్డినాయన ఆశ్రమంగా

14ఏళ్ల క్రితం వెల్దుర్తి మండలంలోని శ్రీరంగాపురం, బేతంచెర్ల పరిధిలోని గూటిపల్లి గ్రామాల మధ్య కొండ దారిలో పాలుట్ల రంగస్వామి ఆలయ సమీపంలో శ్రీరంగాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కాశిరెడ్డి నాయన ఆశ్రమం నిర్మించాడు. భక్తుల విరాళాలతో కాశిరెడ్డి నాయనకు ఆలయం కట్టించాడు. పాత కోటపేట ఆంజనేయస్వామికి గుడి కట్టించి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నాడు. పక్కనే అన్నపూర్ణాదేవి కాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు నిర్మించాడు. నాగదేవత, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించాడు. పాలుట్ల రంగస్వామి ఆలయంతోపాటు కాశిరెడ్డి నాయన వద్దకు వచ్చే భక్తులు, కొండ ప్రాంతాల్లోని ఆలయ, అటవీ సిబ్బంది, గొర్రెల, పశువుల కాపర్లు, వాహనదారులకు నిత్యాన్న దానం చేస్తున్నారు.

నేడు ఆరాధనోత్సవాలు..

ఈనెల 10వ తేదీన కోటపేట ఆంజనేయస్వామి, కాశిరెడ్డి నాయన 15వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి పూజలు, సాయంత్రం నందికోల సేవ, జ్యోతి జ్వాల, కట్టికోలన్న, చెక్కభజన, నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అలాగే ఉదయం న్యూ కేటగిరి వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించి, విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం గుండు ఎత్తు పందెం నిర్వహించి విజేతలకు 4తులాల వెండి, 2తులాల వెండి బహూకరించనున్నారు.

కనులపండువగా వసంతోత్సవం


ఉత్సవమూర్తులను పల్లకీలో పూజారి ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం

- ముగిసిన సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు
- పూజారి ఇంటికి చేరిన ఉత్సవమూర్తులు



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి


కన్నడ సామాజిక నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

హొళగుంద: సిద్ధేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం కనుల పండువగా నిర్వహించారు. 2న కంకణ ధారణతో ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆలయంలో స్వామి వారికి ఆకుపూజ, మహామంగళహారతి, అభిషేకాలు తదితర పూజలు చేపట్టారు. అనంతరం రాత్రి పల్లకీలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయ పూజారుల ఇంటికి చేర్చడంతో వేడుకలు పరిసమాప్తి అయ్యాయి.

సర్వమత సమ్మేళనం.. లాలుస్వామి ఉరుసు

- రేపటి నుంచి ఉత్సవాలు
- జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక
- 11న కబడ్డీ, 13న బండలాగుడు పోటీలు


లాలుస్వామి దర్గా

కృష్ణగిరి: హిందూ ముస్లింల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న చిట్యాలలోని తాత లాలుస్వామి ఉరుసు ఈ నెల 11న ప్రారంభం కానున్నాయి. కొలిచే వారికి కొంగు బంగారమై, ఆపదలో ఆదుకునే మహిమాన్వితుడిగా పూజలందుకుంటున్నాడు. తాత ఉత్సవాలను 11నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. అందుకు కావాల్సిన ఏర్పాట్లను దర్గా ఉత్సవ కమిటీ సభ్యులు చేపడుతున్నారు. వేడుకలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

చరిత్ర..

దాదాపు 200 ఏళ్ల క్రితం గ్రామంలోని బోయ ఉలిగి కుటుంబంలో జన్మించిన లాలుస్వామి చిన్నతనం నుంచే మహిమలు చూపుతూ అందరి మన్ననలు పొందారు. ఎవరికైనా జ్వరం వచ్చినా ఇతన్ని అనుసరిస్తే నయమయ్యేదని, కరువు సమయంలోనూ గ్రామాన్ని రక్షించారని స్థానిక చరిత్ర. అలాగే వ్యవసాయ సాగులో లాభనష్టాలను, ప్రకృతి వైపరిత్యాలను ముందుగానే తెలిపేవాడట. భక్తుల సంఖ్య అధికం కావడంతో గ్రామాన్ని కాపాడేందుకు 150 ఏళ్ల క్రితమే జీవ సమాధి అయ్యాడని ప్రతీతి.

మూడు రోజులపాటు కార్యక్రమాలు..

ఉత్సవాల్లో భాగంగా 11న రాత్రి 11 గంటల నుంచి మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారికి అశ్వవాహనంపై గంధం సమర్పణ ఉంటుంది. అదే రోజు రాష్ట్రస్థాయి హోం టీమ్స్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు అందించనున్నారు. అలాగే 12న ఉరుసు కార్యక్రమంలో భాగంగా స్వామికి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. 13న కిస్తీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అదే రోజు రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. విజేతగా నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.50వేలు, రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వివరాలకు సెల్ 9989028249, 9440637027 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రతి ఇంట్లో లాలుస్వాములే ..

లాలుస్వామి తన మహిమల వల్ల మొదట్లో లబ్ధి పొందిన వారు తమ పిల్లలకు ఆయన పేరే పెట్టుకునే వారు. దీంతో గ్రామంలో లాలుస్వామి పేరు ఉండని ఇల్లు ఉండదు. అలాగే కొత్త వాహనం కొనుగోలు చేసినా, ఏదైనా కార్యక్రమం ప్రారంభించినా లాలుస్వామి పెట్టడం ఆనవాయితీగా మారింది.